ప్రజాస్వరం
PRAJASWARAM తెలుగు దినపత్రిక
Bullet Edition
శుక్రవారం, 28 జూన్ 2024 www.prajaaswaramdaily.com 2PM



## ఢిల్లీ విమానాశ్రయంలో

# కూలిన పైకప్పు

## ఒకరు మృతి... ఆరుగురికి గాయాలు

న్యూఢిల్లీ, జూన్ 28 (ప్రజాస్వరం): దేశ రాజధాని ఢిల్లీలోని విమానాశ్రయంలో టెర్మినల్ -1 పైకప్పులో కొంత భాగం శుక్రవారం తెల్లవారుజామున కుప్పకూలింది. ఈ ఘటనలో ఒకరు మృతి చెందారు.ఆరుగురికి గాయాలు అయ్యాయి. ఢిల్లీలో కురుస్తున్న కుండపోత వర్షానికి ఈ ఘటన జరిగింది. పలు వాహనాలు, టాక్సీలు దెబ్బతిన్నాయి. ప్రమాద స్థలం దగ్గర సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. చెక్ ఇన్ కౌంటర్లు తాత్కాలికంగా మూసివేసారు. టెర్మినల్-1లో విమాన రాకపోకలు బంద్ అయ్యాయి. ఎయిర్ పోర్టు ఘటనపై కేంద్ర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు స్పందించారు. సహాయక చర్యలు చురుకుగా కొనసాగుతున్నాయి. క్షతగాత్రులను ఆసుపత్రులకు తరలించామని అన్నారు. తెల్లవారు జామున ప్రమాదం విషయం తెలియగానే అగ్ని మాపక శకటాలు టెర్మినల్ 1 వద్దకు చేరుకున్నాయి. ఒర రూఫ్ షీటు, సపోర్ట్ బీములు కూలిపోయాయి. ఢిల్లీ పోలీసులు, కేంద్ర పారిశ్రామిక భద్రతా దళం, ఎన్డీఆర్ఎఫ్ దళాలు సహాయక చర్యల్లో పాల్గొంటున్నాయి. మరోవైపు టెర్మినల్ -1 నుంచి బయలుదేరే అన్ని విమాన సర్వీసులను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు విమానాశ్రయ అధికారులు ప్రకటించారు. కాగా, విమానాశ్రయంలో పైకప్పు కూలిన సంఘటనను స్వయంగా పర్యవేక్షిస్తున్నట్లు పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు తెలిపారు. సహాయక చర్యలు కొనసాగుతున్నాయన్నారు. టెర్మినల్-1 వద్ద ప్రయాణికులందరికీ తగిన ఏర్పాట్లు చేయాలని చేయాలని విమానయాన సంస్థలకు సూచించారు. క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించామని తెలిపారు.

### ఢిల్లీలో రెండోరోజూ వర్షాలు

ఢిల్లీలోని చాలా ప్రాంతాల్లో వరుసగా రెండోరోజూ వర్షాలు కురుస్తున్నాయి. ఇప్పటి వరకు భీకర ఎండలతో అల్లాడిన ప్రజలకు కాస్త ఉపశమనం లభించింది. కానీ, ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో చాలా ప్రాంతాల్లో నీరు నిలిచిపోయింది. దీంతో వాహన రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పలు ప్రాంతాల్లో వాహనాలు పూర్తిగా నీటిలో మునిగిపోయిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరలవుతున్నాయి.

## ఏబీవీపీ ఆందోళన

హైదరాబాద్, జూన్ 28 (ప్రజాస్వరం): విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) ఆందోళనకు దిగింది. హైదరాబాద్‌లోని విద్యాశాఖ కమిషనర్ కార్యాలయాన్ని ఏబీవీపీ కార్యకర్తలు ముట్టడించి ధర్నాకు దిగారు. రాష్ట్రంలో విద్యా రంగాన్ని పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ప్రభుత్వ నిబంధనలు పాటించని ప్రైవేటు పాఠశాలల గుర్తింపును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత లేకుండా చూడాలని.. ఇతర సమస్యలు పరిష్కరించాలని నినాదాలు చేశారు.





## కేసీఆర్ పిటిషన్‌పై తీర్పు రిజర్వు

హైదరాబాద్, జూన్ 28 (ప్రజాస్వరం): విద్యుత్ కొనుగోలు, భద్రాద్రి పవర్ ప్లాంట్ నిర్మాణానికి సంబంధించి ప్రభుత్వ నిర్ణయంలో లోటుపాట్లను సమీక్షించడానికి జస్టిస్ ఎల్. నరసింహారెడ్డి కమిషన్ ఏర్పాటుపై మాజీ సీఎం, బీఆర్ఎస్ చీఫ్ కేసీఆర్ దాఖలు చేసిన పిటిషన్‌పై వాదనలు ముగిశాయి. అయితే తీర్పును హైకోర్టు రిజర్వ్ చేసింది. కేసీఆర్ పిటిషన్‌పై తీర్పును ఈ రోజు లేదా సోమవారం వెల్లడిస్తామని హైకోర్టు తెలిపింది. ప్రభుత్వం తరఫున వాదనలను ఏజీ వినిపించారు. కాగా, విద్యుత్ కొనుగోలు అంశంపై హైకోర్టు తీర్పుపై ఉత్కంఠ కొనసాగుతోంది.

## హేమంత్ సోరెన్‌కు

# బెయిల్

### భూ కుంభకోణం కేసులో మాజీ సీఎంకు ఊరట



హైదరాబాద్, జూన్ 28 (ప్రజాస్వరం): భూ కుంభకోణానికి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో విచారణను ఎదుర్కొంటున్న ఝార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్కు ఊరట లభించింది. ఈ కేసులో ఆయనకు రాష్ట్ర హైకోర్టు శుక్రవారం బెయిల్ మంజూరుచేసింది. ప్రాథమిక ఆధారాల పరంగా ఆయన ఏ నేరానికి పాల్పడలేదు. బెయిల్ పై ఉన్నప్పుడు నేరం చేసే అవకాశాలు కూడా లేవని కోర్టు గుర్తించింది. అందుకే ఆయనకు బెయిల్ ఇస్తున్నాం అని ధర్మాసనం ఈ సందర్భంగా వ్యాఖ్యానించింది.

### మనీలాండరింగ్ కేసు

భూ కుంభకోణానికి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో ఝార్ఖండ్ ముక్తిమోర్చ కార్యనిర్వాహక అధ్యక్షుడు హేమంత్ సోరెన్ ను ఈ ఏడాది జనవరి 31న ఈడీ అధికారులు అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. అప్పటినుంచి ఆయన బిర్సా ముండా జైల్లో ఉన్నారు. అరెస్టుకు కొన్ని గంటల ముందే ఆయన నాటకీయ పరిణామాల నడుమ ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయగా.. నూతన సీఎంగా చంపాయి సోరెన్ బాధ్యతలు చేపట్టారు.

రాంచీలో 8.86 ఎకరాలకు సంబంధించిన భూ కుంభకోణం కేసులో హేమంత్ సోరెన్ అరెస్టయ్యారు. ఆయన ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో అధికారిక రికార్డులు తారుమారు చేయడం, కల్పిత లావాదేవీలు, నకిలీ పత్రాలతో కోట్లాది రూపాయల విలువైన భూమిని సంపాదించి.. అక్రమ ఆదాయాన్ని పొందారని ఈడీ ఆరోపించింది. ఈ కేసులో బెయిల్ కోసం సోరెన్ పలు న్యాయస్థానాలను ఆశ్రయించారు. ఎన్నికల వేళ ప్రచార నిమిత్తం బెయిల్ ఇవ్వాలని సుప్రీంకోర్టును కోరినప్పటికీ ఉపశమనం లభించలేదు. చివరకు నేడు ఆయనకు హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది.



# నీట్ కలకలం..

## ఉభయసభల్లో దుమారం

### విద్యార్థుల కోసం చర్చించాలని రాహుల్ పట్టు

### సోమవారానికి వాయిదా

న్యూఢిల్లీ, జూన్ 28 (ప్రజాస్వరం): పార్లమెంటులో గందగోళ పరిస్థితి నెలకొంది. 'నీట్ పేపర్ లీక్' వ్యవహారంపై చర్చ జరపాలని విపక్షాలు పట్టుబట్టాయి. ఉభయసభల్లో నీట్ వ్యవహారం దుమారం రేపుతోంది. ప్రతిపక్షాల ఆందోళనలతో ఉభయసభలు సోమవారానికి వాయిదా పడ్డాయి. శుక్రవారం ఉదయం 11 గంటలకు లోక్ సభ ప్రారంభం కాగానే ఇటీవల మృతిచెందిన పలువురు రాజకీయ ప్రముఖులకు సభ సంతాపం ప్రకటించింది. ఆ తర్వాత రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానాన్ని కేంద్రం ప్రవేశపెట్టింది. దీనిపై స్పీకర్ చర్చను ప్రారంభించగా.. ప్రతిపక్షాలు నీట్ అంశంపై గందరగోళం నెలకొంది. నీట్ పేపర్ లీక్ అంశంపై విద్యార్థుల కోసం సభలో చర్చించాలని ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కోరారు. ఇందుకు స్పీకర్ ఓం బిర్లా అంగీకరించకపోవడంతో విపక్షాలు ఆందోళనకు దిగాయి. దీంతో స్పీకర్ సభను మధ్యాహ్నం 12 గంటల వరకు వాయిదా వేశారు. ఆ తర్వాత సభ తిరిగి ప్రారంభమైనప్పటికీ పరిస్థితిలో ఎలాంటి మార్పు రాలేదు. దీంతో లోక సభ స్పీకర్ ఓం బిర్లా సభను సోమవారానికి వాయిదా వేస్తున్నట్లు స్పీకర్ ప్రకటించారు.

### రాజ్యసభలోనూ గందరగోళం

అటు రాజ్యసభలోనూ నీట్ అంశంపై రగడ జరిగింది రాజ్యసభలో రాష్ట్రపతి ప్రసంగంపై బీజేపీ నేత సుధాన్షు త్రివేది చర్చను ప్రారంభించడంతో గందరగోళం నెలకొంది. పేపర్ లీకేజీలపై చర్చకు పట్టుబడుతూ విపక్షాలు నినాదాలు చేశాయి. ఆందోళనల మధ్యే ఛైర్మన్ సభను నడిపించారు. అయినప్పటికీ ప్రతిపక్షాలు పట్టువీడకపోడంతో ఛైర్మన్ జగ్ దీప్ ధన్ ఖడ్ సభను మధ్యాహ్నం 12 గంటల వరకు వాయిదా వేశారు. సభ తిరిగి ప్రారంభమైన తర్వాత కూడా అదే పరిస్థితి నెలకొంది. దీంతో, వారి నిరసనల నడుమే రాష్ట్రపతికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై రాజ్యసభలో చర్చను చేపట్టారు. ప్రతిపక్షాల తీరుపై లోక్ సభ పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు మండిపడ్డారు. పార్లమెంటు చరిత్రలోనే ఈ విధంగా రాష్ట్రపతి చర్చలో ఇతర అంశాలపై చర్చ జరగలేదని ఫైర్ అయ్యారు.



## కర్ణాటకలో ఘోర ప్రమాదం

# 13 మంది మృతి

బెంగళూరు, జూన్ 28 (ప్రజాస్వరం): కర్ణాటకలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఘటనలో 13 మంది మృతి చెందారు. వీరంతా దైవ దర్శనానికి వెళ్లి వస్తుండగా ప్రమాదం జరిగింది. కర్ణాటకలోని హావేరి జిల్లాలో ఆగి ఉన్న ఓ లారీని టెంపో వెనక నుంచి ఢీకొట్టడం వల్ల శుక్రవారం తెల్లవారుజామున ఈ ప్రమాదం జరిగింది. వీరంతా సవదత్తిలోని ఆలయానికి వెళ్లి వస్తుండగా గుండెనహళ్లి సమీపంలో పుణె-బెంగళూరు జాతీయ రహదారిపై ఈ ప్రమాదం చోటుచేసుకుంది. సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన ప్రమాద స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు.

## మెదక్ జిల్లాలో

## రెండు లారీలు ఢీకొని

# నలుగురు..

మెదక్, జూన్ 28 (ప్రజాస్వరం): రెండు లారీలు ఢీకొని నలుగురు మృతి చెందారు. ఈ సంఘటన మెదక్ జిల్లా చేగుంట మండలం వడియారం వద్ద బైపాస్‌రోడ్డుపై జరిగింది. ముందు వెళ్తున్న లారీని వెనక నుంచి వస్తున్న మరో లారీ ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో వెనక లారీలో క్యాబిన్‌లో కూర్చున్న నలుగురు మృతి చెందారు. ఈ ప్రమాదంలో మరో నలుగురికి గాయాలు అయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు.



## కుక్కల దాడిలో చిన్నారి..

సంగారెడ్డి, జూన్ 28 (ప్రజాస్వరం): పటాన్ చెరు మండలం ఇస్నాపూర్ గ్రామంలో దారుణం జరిగింది. మహీదర వెంచర్ లో ఎనిమిదేళ్ల విశాల్ పిల్లవాడిపై కుక్కలు దాడి చేసాయి. కాలకృత్యాక కోసం వెళ్లిన విశాల్ పై కుక్కల దాడిలో చిన్నారి చనిపోయాడు. మృతుని కుటుంబం బీహార్ రాష్ట్రం నుంచి కూలి పనికి వచ్చింది. మృతదేహాన్ని పటాన్ చెరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.



## రవాణా శాఖ అధికారుల పెన్ డౌన్

హైదరాబాద్, జూన్ 28 (ప్రజాస్వరం): రాష్ట్ర వ్యాప్తంగా రవాణా శాఖ అధికారులు పెన్ డౌన్ పాటిస్తున్నారు. నిన్న ఖైరతాబాద్ ఆర్టీఏ కార్యాలయంలో జేటీసీ రమేశ్ పై ఆటో యూనియన్ నేత దాడికి పాల్పడిన ఘటనకు నిరసనగా ఈ నిర్ణయం తీసుకున్నారు. తను అడిగిన పని చేయడం కుదరదని జేటీసీ రమేశ్ కుమార్ చెప్పడంతో నిన్న అమానుల్లాఖాన్ జేటీసీని చెంపదెబ్బ కొట్టారు. దీనికి నిరసనగా శుక్రవారం రవాణా శాఖ ఉద్యోగులు నిరసనకు దిగారు. నిందితుడిని శిక్షించాలని డిమాండ్ చేశారు. అయితే రవాణా శాఖ కమిషనర్ తో చర్చల అనంతరం పెన్ డౌన్ ఆలోచన విరమించుకుని నల్లరిబ్బన్లు ధరించి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఉద్యోగులు మాట్లాడుతూ.. భౌతిక దాడులు సరికావని ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోవైపు దాడికి పాల్పడిన అమానుల్లాఖాన్ ను పోలీసులు అరెస్టు చేసి జైలుకు తరలించారు.